# ఆత్మవిశ్వాసం

నేను కథకు క్లయిమాక్స్ పెట్టనని వెనుక ప్రతీతిగా వుండేది. కాని యిటీవల నాలో ఏమి మార్పువచ్చిందో ఏమో, క్లయిమాక్స్ విధిగా పెడుతున్నాను. పైగా ఆ క్లయిమాక్స్ లన్నీ విధిగా యాదృచ్ఛిక సంఘటనలుగా వుంటున్నయి. అందులో ప్రధానంగా కారు వ్యక్తిని ఢీకొనటం వుంటూ వుంది. యెందుకా అని చాలాఆలోచించాను. కాని నా బుద్ధికి కారణం కనుపించలేదు. యితరుల స్వభావాన్ని గురించి మనం తెలుసుకోగం. కనీసం తెలుసుకున్నట్లు మాట్లాడగలం. కాని యెవ్వరి గురించి వారు తెలుసుకోవడం సులభసాధ్యమైన పనికాదు. దీనికి కారణం యెవరికి వారు తమలోవున్న అసమర్థతతను గుర్తించటానికి భయపడి కప్పిపుచ్చుకోటానికి ప్రయత్నించటమని నేను అనుకుంటాను. యితరులమీదకు విసిరిన విసుర్లు మనమీదకు మనం విసురుకోలేంగదా!

నేనుకూడా అందరివంటివాణ్నే. కాకపోతే వొక్కొక్కరికి వొక్కొక్క విద్యలో నేర్పువున్నట్లు నాకు వ్రాయటంలో నేర్పువుంది. అంతే! స్వభావంలోమాత్రం యెక్కువ తేడా లేదు. ఈ రహస్యం నేను యిటీవలే తెలుసుకున్నాను.

వెనుక నేను కథకు క్లయిమాక్స్ పెట్టనని విమర్శకులు నన్ను నిందించేరు. అప్పుడు క్లయిమాక్స్ పెట్టటం అనేది కృత్రిమోపాయమనీ, స్వభావసిద్ధమైన విషయంకాదనీ నేను

వాదించాను. క్లయిమాక్స్‌యొక్క నిష్ప్రయోజకతని గురించి కొన్ని వ్యాసాలు వ్రాసినట్లుకూడా నాకుగుర్తు. యిప్పుడీ కథను గురించి ఆలోచించినప్పుడల్లా ముందుగా క్లయిమాక్సే మన స్సుకి తడుతూవుంది. అదికూడా భౌతికస్వభావం కలిగిన క్లయి మాక్సు. యాదృచ్ఛికంగా సంభవించే క్లయిమాక్స్. అందు లోనూ కారు మనిషిని ఢీకొనటం.

ఈ కారు మనిషిన ఢీకొనటం, యింతకుముందు నేను వ్రాసిన రెండుమూడు కథలకు క్లయిమాక్స్‌గా ఉపయోగ పడి వున్నది. అందువల్ల యిప్పట్లో మరొక కథకు క్లయి మాక్స్‌గా వాడగూడదనే మనస్సులో నిశ్చయించుకున్నాను. కొన్నాళ్ళపాటు దానిని మరచి పోదామని ప్రయత్నించాను. కాని నావల్ల కాలేదు. మరచిపోదామని ప్రయత్నించిన కొద్దీ మనోవీధిలో తిష్ట వేసుకొని కూర్చుంది. ఏంచెయ్యను?

ఈ విషయం నేను చాలాదూరం ఆలోచించాను. ఆలోచించటంలో యేమాత్రం లోటూ చెయ్యలేదు. ఆలో చించగా ఆలోచించగా 'కారు మనిషిని ఢీకొనటం అనేది యెన్నిసార్లు క్లయిమాక్స్‌గా పెడితే తప్పేమివుంది? అనే ప్రశ్న ఉదయించింది. జీవితంలో ఈ సంఘటన యెన్నిసార్లు రిపీట్ కావటంలేదు. కథలు జీవితాన్ని స్వభావసిద్ధంగా చిత్రించాలి గదా! యిక ఈ క్లయిమాక్స్ రిపీట్ అయితేమాత్రం తప్పేమి వుంది?' అనిపించింది. అందులో యిటీవల ఇటువంటి సంఘట నలు చాలా యెక్కువయినాయి. పత్రిక తెరిస్తే ఇవే కనబడు తున్నాయి. బజారుకు వెళ్తే యివే కనబడుతున్నాయి. మాటల సందర్భంలో యివే వినబడుతున్నాయి. రచయిత జీవితాన్ని

ప్రతిబింబించి వ్యాఖ్యానిస్తాడు. యిక జీవితంలో తరచు జరిగే సంఘటనలనుంచి యెలా తప్పించుకోగలుగుతారు? అలా తప్పించుకోవాలనుకోవటం పొరపాటు అనికూడా అనిపించింది ఆక్షణం నాకు.

కాని వెంటనే వొక్కొక్క కథకు వొక్కొక్క క్లయిమాక్స పెట్టలేక, కనీసం క్లయిమాక్సలు రిపీట్ కాకుండా నైనా చూచుకోలేక, నా అసమర్థతను కప్పుకోటానికి కారణాలను వెతుకుతున్నానేమో అని మనస్సుకు భయం కలిగింది. నామీద నాకు అయిష్టం యేర్పడింది.

మనస్సు దేముంది? యెటుత్రిప్పితే అటు తిరుగుతుంది. యెటునుంచైనా కారణాలను పోగుచెయ్యగలదు. తన యజమానికి అనుకూలంగా యెటువంటి వ్యతిరేక విషయాన్నయినా సర్ది చెప్పగలదు. తన యజమాని యేస్థితిలోవుంటే ఆ స్థితిని సమర్థించ గలదు.

మనస్సు వొక పెద్ద రాజకీయవేత్త. దాని స్వభావం నాకు తెలియనిదికాదు. అయినప్పటికీ నేను చెయ్యకలిగింది యేమీ కనపడలేదు. మనిషిని కారు ఢీ కొనటం అనే క్లయిమాక్సనుంచి నేను తప్పించుకోలేక పోతున్నాను. అది నక్షుడుం పట్టుకున్నట్లు పట్టుకుంది.

అయితే నేను ఏనాడూ పాఠకులదగ్గరనుంచి నాఅంతర్గత భావాలను దాచలేదు. నా కష్టసుఖాలను వారికి చెప్పుకోవటం నాకు అలవాటు. వారుకూడా శ్రద్ధగా సానుభూతితో వింటూ వుంటారు. అది వారికి అలవాటు. అందుని ఈ క్లయిమాక్సకి

సంబంధించిన బాధను ఉన్నది ఉన్నట్లు వారికి చెప్పుకుంటు న్నాను.

కారు మనిషిని ఢీకొనటం అనే క్లయిమాక్స్ నుంచి యెంత ప్రయత్నించీ నేను తప్పుకోలేక పోతున్నానని వారికి మనవి చేసుకుంటున్నాను. అలా తప్పించుకోలేక ఈ కథకు కూడా ఆ క్లయిమాక్సే పెట్టాను. యేం చెయ్యను మరి? ఎంత ప్రయత్నించినా మరొకరకం క్లయిమాక్స్ నాకు దొరకటం లేదు. పాఠకులు నన్ను క్షమించగల రనుకుంటాను.

*　　　*　　　*

నే నారోజు సాయంకాలం వంటచేస్తున్నాను. నేనుగా వంటచెయ్యటానికి కారణం నాభార్య వంటచెయ్యకపోవటం వల్లా, వంటవాణ్ణి పెట్టుకునే తాహతు నాకు లేకపోవటంవల్లా కాదు.

నా భార్యకు వంటవాణ్ని పెట్టటం యిష్టం వుండదు. వాళ్ళు యెక్కువ దుబారా చేస్తారని ఆమెవుద్దేశం. అదీ కాక ఆడవాళ్ళువున్నయింట్లో వంటవాళ్లు యెక్కువకాలం నిలవరు. వీళ్లు అజ కనుక్కోకమానరు; వాళ్లు తగాదాకు దిగక వూరుకోరు. అందుకని ఆమే వంటచేస్తూవుంటుంది.

కాని ఆమె వంటచేస్తూవుంటే చూడడానికి నాకు మహా కష్టంగావుండేది. ఉదయంలేచి పడుకోబోయేవరకూ ఆమె పొయ్యిదగ్గరకూర్చొని ఏదోవొకటి వండుతూనేఉండేది. ఈ వంటతో ఆమె ఆరోగ్యం పూర్తిగా చెడింది.

ఆమె బాగా చదువుకున్నదికూడా. నిజం చెప్పాలంటే తెలుగు నాకన్నా యెక్కువ చదువుకున్నది. సంస్కృతం

కూడా కొద్దో గొప్పో వచ్చు. అటువంటి మనిషికి యీ వంట వల్ల చదువుకోటానికి వొక్క క్షణంకూడా తీరిక వుండేది కాదు. నేర్చుకున్న చదువుకాస్తా మరచిపోయేస్థితికి వచ్చింది. యే చదువూ రాని వాళ్ళమ్మకుమల్లే మాట్లాడటం, ప్రవర్తించటం మొదలు పెట్టింది. ఆమె ఈవిధగా అయిపోవటానికి కారణం నేనే. నేను ముందునుంచీ ఆమెపట్ల కొంత శ్రద్ధవహించివుండ వలసింది, అని అనిపించిందినాకు. అలా అనిపించి వొకరోజు ఆమెతో 'వొకపూట నేను వంటచేస్తాను' అని చెప్పాను.

మొదట్లో ఆమె అంగీకరించలేదు.

"అయితే వంటవాణ్ణి పెడతాను" అని బెదిరించాను.

యెలాగైతేం, ఆమె ఒప్పుకునేటట్లు చేశాను. వుదయం ఆమె వంటచేసేటట్లూ సాయంకాలం నేను వంటచేసేటట్లూ రాజీపడ్డాం. కాని పనిచెయ్యవలసివచ్చేప్పటికి, యేదో వుప్పూ కారం చల్లుతానంటూవచ్చి అన్నిపనులూ తనే చెయ్యటం మొదలుపెట్టింది. చివరకు నాకు మిగిలింది పొయ్యిదగ్గర కూర్చొని వేగుతున్న కూరలను గరిటతో అటూయిటూ పొర్లించటం, ఆమె అజాగ్రత్తగావున్నప్పుడు మాడ్చటం.

ఆనాడు నేను సరిగ్గా యిదే పనిలోఉన్నాను. బయట నుంచి కూరగాయలు అమ్మేవాని కేక వినబడింది. "యిప్పుడే వస్తాను జాగ్రత్తగా చూస్తూవుండండి" అనిచెప్పి, నాభార్య కూరగాయలు కొనటానికి బయటకు వెళ్ళింది.

నేను హైదరాబాద్‌లో చిరకాలంనుంచీ వుంటున్న వాణ్ణికాను. హైదరాబాదు సంస్థానం ఆంధ్రరాష్ట్రంలో కలిసినమీదట ఉద్యోగధర్మంలో వచ్చివుంటున్నవాణ్ణి.

హైదరాబాద్‌లో అడుగు పెట్టీ పెట్టగానే నన్ను ఆకర్షించిన దృశ్యాలలో ఈ కూరగాయల అమ్మకం వొకటి. ఇంతకుముందు నేను యెరిగిన పల్లెల్లోగాని పట్టణాల్లోగాని ఇండ్లకువచ్చి కూరగాయలు అమ్ముకునేవాళ్లు తట్టలతో తెచ్చి అమ్ముకుంటూ ఉండేవారు. సామాన్యంగా స్త్రీలే ఈ పని చేస్తూవుండేవారు. కొన్నికొన్ని పల్లెటూళ్ళల్లో మగవాళ్లు కావిడి వేసుకువచ్చి అమ్మటంకూడా నేను యెరుగుదును. కాని హైదరాబాద్‌లో రబ్బరుచక్రాల బండిమీద కూరగాయలు పోసుకొని భార్యాభర్తలు ఆ బండిని తోసుకుంటూ వచ్చి ప్రతి యింటిదగ్గరా ఆపి కూరలు అమ్ముకుంటూ వుంటారు. బేరంలేని సమయంలో సరసాలు ఆడుకుంటూ కాలక్షేపం చేస్తూవుంటారు. నా మనస్సును ఈ పద్ధతి బాగా ఆకర్షించింది.

భర్త పనినెపంతో ఊరుపట్టుకు తిరుగుతుంటే, భార్య కునుకుతూ యింట్లోకూర్చునే పద్ధతి నాకుఏనాడూ నచ్చలేదు. ఇద్దరూ చెరొక పనిమీదా వెళ్ళిందానికంటే, యిద్దరూ కలిసి వొకేపని చేసుకొని పొట్టపోసుకోవటం నాకు సొగసు అనిపించింది.

ఈ బండ్లమీద రాసిపోసి కూరలమ్మటం నాకు ఇంకొక అందుకుకూడా నచ్చింది. నాకు వివాహమై వేరు కాపురం పెట్టినప్పటినుంచీ నేనే యింటికి కూరలుతెస్తూవున్నాను. నా భార్యకంటే మంచికూరలు తేగలననీ, బాగా బేరం చేయగలననీ అనే అహంకారంకాదు దీనికి కారణం. నేనుపల్లెటూరిలో పుట్టిపెరిగాను. నాకు చేలన్నా, పంటలన్నా యెక్కువ ఇష్టం.

వరిచేలు పొట్టపోసుకొని వున్నప్పుడు చూస్తూ ఆచేలగట్లమీద అలాకూర్చుండి పోయేవాణ్ని. కోసిన పైరుని పనలుపనలుగా కట్టటం, కుప్పలుగా వెయ్యటం, నూర్చటం నా మనస్సుకి ఆహ్లాదంగావుండేవి. కుప్పలు నూర్చేసమయంలో పాలేర్లతో పాటు నేనూ కొన్ని రాత్రిళ్లు పొలంలో పడుకున్నాను. చలికి కడెంలోదూరి పడుకున్నాను. చిన్నతనంలోని ఈ అభిరుచి నా రక్తాన్ని వొదిలిపెట్టకుండా ఉందేమో, వారానికి వొకటి రెండుసార్లయినా మార్కెట్‌కి వెళ్ళి పేర్చివున్న ఆకుకూరలనూ, కూరగాయలనూ చూడకపోతే మనస్సుకు బెంగగా వుండేది.

అందుకని నేనే కూరలను తేవటానికి వెళ్ళటం వొక ఆచారంగా పెట్టుకున్నాను. ఈ సంగతి నా భార్యకు తెలుసు. అందుకని అభ్యంతర చెప్పేదికాదు. మా యింటి దగ్గరవున్న మార్కెట్‌లో వారానికి రెండుసార్లు పెద్దమార్కెట్ నుంచి అంతా క్రొత్తకూరగాయలు వేసుకువస్తూవుండేవారు. ఆరెండు రోజులూ మార్కెట్ నాకు నవనవలాడుతూ కళకళలాడుతూ కన్నులపండువుగా కనుపించేది. ఆ కాసేపూ నాకు మా ఊళ్లో చేలమధ్యే వున్నట్లు వుండేది.

హైదరాబాద్‌లో ఈ తోపుడు బండ్లమీద రకరకాల కూరగాయలను పెట్టుకొని అమ్ముతుంటారు. వొకొ్కక్కసారి వొకేరకం కూరగాయలను బండిమధ్య రాశిపోసి అమ్ముతుంటారు. వొకప్పుడు బీరకాయలూ, వొకప్పుడు వంకాయలూ, వొకప్పుడు సొరకాయలూ అమ్ముతుంటారు. ఆ రాసు

లను మోసుకు వెళ్ళేబండ్లు కనుపించినప్పుడు నాకు నిజంగా తన్మయత్వం కలిగేది. యెంత అర్జెంట్‌పనిమీద వెళ్తున్నా ఆగి చూస్తూ నిలబడిపోయేవాణ్ణి.

ఇంతకుముందు బయటనుంచి కేకవేసిన అతను యిటువంటి తోపుడుబండితో కూరలు అమ్మే అతనే. అతని దగ్గర నేనుకూడా అప్పుడప్పుడూ కూరలు కొంటూవుంటాను. అతనికీ అందరికీ వున్నట్లే వొక భార్యవుంది. యెప్పుడూ ఇద్దరూ కలిసే వొస్తూవుండేవారు. అతను కూరలు బేరం చెపుతూనే వుండేవాడు; తూస్తూనే వుండేవాడు; భార్యతో యేదో మాట్లాతూడునే వుండేవాడు. నా మట్టుకు నాకు అస్తమానం మాట్లాడుకోటానికి వాళ్ళకు యేం కబుర్లు వుంటాయూ అని ఆశ్చర్యం కలుగుతూ వుండేది. వాళ్లు యెప్పుడూ పోట్లాడుకున్నట్టుగాకూడా కనుపించేవారుకాదు. అతను మాట్లాడే ప్రతిమాటకూ ఆమె నవ్వులు వొలకబోస్తూ వుండేది.

నేను యివన్నీ జ్ఞాపకం చేసుకుంటూ కూర్చున్నాను. కూర వుడకగా పొయ్యిమీదనుంచి దింపాను. ఇంతలో కూరలుకొని నాభార్య వొచ్చింది. తాను వొళ్ళోపోసుకొని తెచ్చినకూరలు డిన్నర్ టేబిల్ మీద గుమ్మరిస్తూ "ఈసంగతి విన్నారా, ఎంత చోద్యంగావుందో!" అన్నది.

"ఏమిటది?" అని అడిగాను.

"అతనిభార్య విడిచిపెట్టి పోయిందట! ఇవ్వాళ వొక్కడే కూరగాయలు అమ్ముతున్నాడు" అన్నది.

ఆమె మాటలు నాకు అర్థంకాలేదు. "ఎక్కడికి వెళ్ళిందట? కన్నవారి ఇంటికి ఏమన్నా వెళ్ళిందా?"

"కన్నవారింటికే. కాని నీతో కాపురంచెయ్యను_ అని చెప్పి వెళ్ళిపోయిందట!"

"కారణం ఏమిటట!" అని అడిగాను.

"ఆమెను, అ త్తకీ.యిటీవల పడటంలేదట. అందుకని తన కన్నవారి యింటికి వచ్చిఉండమని అతనిని కోరిందట. అతను అంగీకరించక పోయేటప్పటికి కోపంవొచ్చి, వెళ్ళిపోయిన దట!"

"కోపం చల్లారగానే మళ్ళీ వొస్తుంది," అన్నాను, అంత ప్రేమగావుండే యిద్దరూ, అంతతేలికగా విడిపోతారని నమ్మలేక.

"ఆ అవకాశం వున్నట్లులేదండీ, అతను పునర్వివాహం చేసుకోటానికి అప్పుడే ప్రయత్నాలు చేస్తున్నాడు."

ఒకసారి సంబంధం ఏర్పడిన మనుష్యులు అంత తేలికగా ఎట్లా విడిపోతారో నాకు అర్థంకాలేదు.

"తొందరపడవద్దని నువ్వు చెప్పవలసింది," అన్నాను.

"చెప్పానండీ"

"ఏమన్నాడు?"

"దానిసంగతి మీకు తెలియదులెండి" అన్నాడు.

అయినప్పటికీ, నాభార్య గట్టిగా చెప్పినప్పటికీ, నేను నమ్మలేదు. ఏదోకోపంమీద అన్నాడనీ, కోపంచల్లారగానే అతనే మళ్ళీ తీసుకుతెచ్చుకుంటాడనీ, అనుకున్నాను.

కాని నేను అనుకున్నట్లు జరగలేదు. నాలుగోరోజు మరొక ఆడమనిషిని వెంటబెట్టుకొని, బండితోలుకుంటూ వచ్చి మా గుమ్మంముందు ఆగాడు. అప్పుడు నేను కూరగాయలు

కొంటున్నాను. వాళ్ళిద్దరూ మహాసంతోషంగా వున్నారు. మొదటిమనిషికన్నా ఈవిడ చిన్నది. అందమైంది. చలాకీ అయిందికూడా; అతనే నవ్వుతూ చెపుతున్నాడు. ఆమె సరసాలాడుతున్నది. వాళ్ళు జరిపే సంభాషణ అతని మొదటి భార్యనుగురించి అని తెలుసుకోటానికి నాకు మెక్కువసేపు పట్టలేదు.

"అప్పుడప్పుడూ మీదపడి కొట్టేదికూడా దండుముండ" అన్నాడు.

"నీ రోగం బాగా కుదిర్చిందిలే" అని ఫక్కున నవ్విందామె.

"నేను తొడపాశం పెట్టేవాణ్ణి. గిలగిల తన్నుకునేది."

ఆమె మళ్ళీ నవ్వింది. నవ్వు మధ్యలో ఆపుకొని, "నన్నట్లాంటి పనులు చెయ్యకయ్యోయ్! చేస్తే వూరుకోను" అన్నది.

"తొడపాశానికేం? బలే రంజుగాఉంటుంది" అన్నాడు.

"ఉంటుంది, ఉంటుంది" అన్నదామె నవ్వుతూనే.

నేను అన్నీ వింటూనే ఉన్నాను. కాని వాళ్ళ ప్రేమ కలాపంలో వాళ్ళు ఉండటంవల్ల నా గమనమే వాళ్ళకులేదు. వాళ్ళదృష్టి సంచిపట్టుకున్న నా వైపుకు త్రిప్పుకోవాలనే ఉద్దేశంతో, "పొడుగు వంకాయలు తేవటంలేదే?" అని అడిగాను.

"అవి ఇక్కడివి కావండీ. విజయవాడనుంచి లారీల్లో వస్తయి. కాపు అయిపోయిందేమో నాలుగురోజులనుంచిరావటంలేదు" అన్నాడు.

"మీ కీ వంకాయలు తినక అనుకుంటారుగాని, ఆటి కంటే యియ్యే మంచివి" అన్నదామె బండిమీద కుప్పగా పోసివున్న పొట్టివంకాయలు చూపుతూ.

"ఎందుకని?" అని అడిగాను, ఆమెను ఇంకా మాట్లాడిద్దామనే ఉద్దేశంతో.

"ఆ పొడుగు వంకాయలో వుండేదంతా నీరేనండీ. ఉడకేస్తే గుజ్జుగుజ్జయి ఊరుకుంటుంది. ఎంత ఉడకబెట్టినా ఈ వంకాయ ముక్కగా నిలబడుతుంది. పంటికి బాగా అమరుతుంది" అన్నది.

"అది చెప్పింది సత్తెమేనండీ" అన్నాడతను.

"సరే మెట్లా యిస్తావు?" అని అడిగాను.

"మీ దగ్గర బేరం ఏమిటండీ? తీసుకోండి మీ ఇష్టమొచ్చినకాడికి" అన్నదామె.

హైదరాబాద్‌లో, సర్కారుజిల్లాలలో వలె కూరగాయలను వీశలలెక్కన అమ్మరు. శేర్లలెక్కన అమ్ముతారు. నాలుగణాలలెక్కన వొకశేరువంకాయలు ఇమ్మని అడిగాను. వంకాయలు కారంపెట్టి వేపుడు చేసుకోటానికి వీ xగా వున్నాయి. అందుకని శేరు తీసుకోదలిచాను.

అతను తూస్తూవుండగా, వాళ్ళవిషయం నాకు తెలియనట్లు, "ఈమె ఎవరోయ్?" అని అడిగాను.

"నేను పెళ్ళాడితిని గదండీ" అన్నాడతను.

"ఎప్పుడు?"

"నిన్ననే గదండీ" అన్నాడు.

అయితే ఇంతలోనే యింతచనువు యెట్లా ఏర్పడింది–అనే అనుమానం నాకు కలిగింది. ఆ అనుమానం అతను తీర్చాడు. అతనామెను చాలాకాలంనుంచీ యెరుగునట!

మొన్నటిదాకా అతని గుడిసెకు దగ్గర్లోనే మరొకడితో ఉంటూ ఉండేదట. ఇప్పుడు వాడిని విడిచిపెట్టి అతనిని పెళ్ళి చేసుకుందట. ఈ సంగతులన్నీ ఆమె యెదుటే చెప్పాడు. ఆమె యెక్కడ బాధపడుతోందో అని నేను కంగారుపడ్డాను. ఆమె బాధపడకపోగా సంతోషంగా నవ్వింది.

"పైకి ఇట్లా అగుపడుతుందిగాని, యిదిమాత్రం తక్కువది కాదండోయ్! దానికంటె గెందసాంగురాలే" అన్నాడు.

ఈ మాటకూడా ఆమెకు సంతోషాన్నే కలిగించింది. బిగ్గరగా నవ్వుతూ నుంచుంది.

"తక్కువ తిన్నది ఎవ్వరులేవయ్యా?" అన్నది. ఈ మాటకు అతను సగర్వంగా ముసిముసినవ్వులు నవ్వుకున్నాడు. తూచటం పూర్తిచేసి వంకాయలు నా సంచిలో గుమ్మరించాడు.

నా కుతూహలం ఆగలేదు. రచయితల కందరికీ ఇటువంటి కుతూహలం వుంటుందనుకుంటాను. "మరి ఇంతకు ముందు నీతోవచ్చే ఆడమనిషి ఏమయింది?" అని అడిగాను.

"దాని మానాన అదిపోయింది" అన్నాడు.

"ఎక్కడికి? ఉన్నవారింటికి వెళ్ళిందా?"

"అది పుట్టింటిదగ్గర ఎందుకు వుంటుందండీ. దానికి నా పెళ్ళికి ముందునుంచీ వొకడున్నాడు. వాడితో లేచిపోయి

ఖమ్మంలో కాపురం పెట్టింది. ఇక్కడుంటే వాడితో తిరగ టానికి కుదరటంలేదని మా అమ్మతో తగాదా పెట్టుకొని తన ఇంటికి వచ్చివుండమని కూర్చుంది. అక్కడైతే తన యిష్టం వచ్చినట్లు ఆట సాగించ వచ్చనుకుంది. నాకు చెపుతుందా ఇది? ఇటువంటి ముండల్ని ఎంతమందిని చూశానో నేను" అన్నాడు.

"ఏందయ్యోయ్, నోరు పారేసుకుంటున్నావ్?" అని ప్రశ్నించిందామె కోపం నటిస్తూ.

"నిన్ను కాదులేవే నేనన్నది!" అన్నాడతను కోపంగా.

నేను డబ్బు యిచ్చివేసి, కూరగాయలు తీసుకొని ఇంట్లోకి వెళ్ళాను.

తరువాత కొన్నాళ్ళపాటు వాళ్ళిద్దరూ ప్రతిసాయంత్రం వచ్చి కూరగాయలు యిచ్చిపోతుండేవారు. నాకు వాళ్ళని చూడటానికి ఎందుకో బెరుగ్గావుండేది. అందుకనే ఎప్పుడూ నా భార్యే వాళ్ళదగ్గర కూరగాయలు కొంటూవుండేది. వాళ్ళు పరమానందంగా వుంటున్నారనితప్ప నా కింక యే విష యాలూ వాళ్ళనిగురించి తెలియలేదు.

ఒకరోజు విజయవాడ వెళ్ళవలసినపని నాకు తగిలింది. అక్కడ నాకొక యిల్లువుంది. ఆ యిల్లు అమ్మి హైదరా బాదులో కొనాలనే సంకల్పం నాకు చాలాకాలంనుంచీ వుంది.

హైదరాబాదు రాజధానీనగరం. పిల్లల చదువులకూ, పిదప ఉద్యోగాలకూ ఇక్కడే ఎక్కువ అవకాశాలున్నాయి.

ఖమ్మంలో కాపురం పెట్టింది. ఇక్కడుంటే వాడితో తిరగ టానికి కుదరటంలేదని మా అమ్మతో తగాదా పెట్టుకొని తన ఇంటికి వచ్చివుండమని కూర్చుంది. అక్కడైతే తన యిష్టం వచ్చినట్లు ఆట సాగించ వచ్చనుకుంది. నాకు చెపుతుందా ఇది? ఇటువంటి ముండల్ని ఎంతమందిని చూశానో నేను" అన్నాడు.

"ఏందయ్యోయ్, నోరు పారేసుకుంటున్నావ్?" అని ప్రశ్నించిందామె కోపం నటిస్తూ.

"నిన్ను కాదులేవే నేనన్నది!" అన్నాడతను కోపంగా.

నేను డబ్బు యిచ్చివేసి, కూరగాయలు తీసుకొని ఇంట్లోకి వెళ్ళాను.

తరువాత కొన్నాళ్ళపాటు వాళ్ళిద్దరూ ప్రతిసాయంత్రం వచ్చి కూరగాయలు యిచ్చిపోతుండేవారు. నాకు వాళ్ళని చూడటానికి ఎందుకో బెరుగ్గావుండేది. అందుకనే ఎప్పుడూ నా భార్యే వాళ్ళదగ్గర కూరగాయలు కొంటూవుండేది. వాళ్ళు పరమానందంగా వు-టున్నారనితప్ప నా కింక యే విష యాలూ వాళ్ళనిగురించి తెలియలేదు.

ఒకరోజు విజయవాడ వెళ్ళవలసినపని నాకు తగిలింది. అక్కడ నాకొక యిల్లువుంది. ఆ యిల్లు అమ్మి హైదరా బాదులో కొనాలనే సంకల్పం నాకు చాలాకాలంనుంచీ వుంది.

హైదరాబాదు రాజధానీనగరం. పిల్లల చదువులకూ, పిదప ఉద్యోగాలకూ ఇక్కడే ఎక్కువ అవకాశాలున్నాయి.

విజయవాడలో యిల్లు వుంచుకోవటంవల్ల వచ్చే ప్రయోజనం యేముంది? అందుకని అది అమ్మి చిన్న యిల్లువొకటి ఇక్కడ కొనుక్కొని, ఇక్కడే స్థిరపడిపోదామనే ఉద్దేశంతో యిల్లు బేరంపెట్టాను. మంచిబేరం వొచ్చిందని వొక మిత్రుడు వ్రాయగా నేను వెంటనే విజయవాడ వెళ్ళాను.

అమ్మకం పూర్తి అయ్యేటప్పటికి యెటులేదన్నా వొక వారంరోజులు పట్టింది. రిజిష్టరు పూర్తిచేసి పైకం తీసుకొని హైదరాబాదు వొచ్చాను.

ఆ రాత్రి భోజనాలదగ్గర నా భార్య కూరగాయలు అమ్మేవాని ప్రసక్తి తెచ్చింది. "వాళ్ళకథ పెద్దకథే అయిందండీ" అన్నది.

"ఏం జరిగిందేమిటి?"

"నిన్న అతని భార్య బండితోసుకొని వచ్చింది."

"ఆమె మళ్ళీ యెట్లావచ్చిందీ?"

"చెప్పేది వినండీ" అన్నది నా భార్య. అని అంత వరకు జరిగిన కథంతా చెప్పింది.

"ఆమె మరొకనితో ఖమ్మంలో కాపురం పెట్టినమాట నిజమేనండీ. కొన్నాళ్ళు గడిచింతర్వాత అతనితో విసుగుపుట్టి వచ్చివేసిందట. సరాసరి మొదటి భర్త ఇంటికివెళ్ళి అక్కడే మకాం పెట్టిందట."

"అతను ఊరుకున్నాడా?"

"ఊరుకోక ఏంచేస్తాడండీ? మిగిలిన సంగతులు యెలా వున్నా అతనికి మేనత్త కూతురేగదా."

"నిజమే!" అన్నాను వాళ్ళ చుట్టరికం జ్ఞాపకంవచ్చి.

"వాళ్ళ యింట్లో మకాంపెట్టె ముందు అత్తతో మంచి చేసుకుందట. వరంగల్‌లో తాను సంపాదించినడబ్బు కొద్దిగా మిగిలితే ఆమె కిచ్చిందట. దాన్తో ఆమె మొదటికోడలిని కూడా ఏలవలసిందని కొడుకుతో కజ్జా పెట్టుకుందట. అంతకీ రెండోదానిని విడిచిపెట్టలేకపోతే ఇద్దరితోనూ కాపురం చెయ్యమన్నదట. తల్లిపోరు పడలేక అతనిప్పుడు యిద్దరితోనూ కాపురం చేస్తున్నాడట. వ్యాపారంమాత్రం వాళ్ళిద్దరూ కలిసి చేసుకుంటున్నారట. ఆమె మాత్రం వేరుగా చేసుకుంటూ వుందట. అందువల్ల అత్త యెడతెరిపిలేకుండా ఆమె పక్షమే పలుకుతూవుందట."

"ఎవరు చెప్పారు నీకీసంగతులన్నీ?"

"నిన్న బండితోసుకు వచ్చిందని చెప్పానుగదండీ- ఆమె చెప్పింది."

"అడక్కుండా ఆమె అంత ఆమే చెప్పిందా?"

"ఈ మధ్య కనపడటంలేద్దేమే అన్నా, అక్కడనుంచి అంతా చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమే వాళ్ళూ పోటీలుపడి కూరగాయలు అమ్ముతున్నారు. వాళ్ళదగ్గర కొనవద్దనీ తన దగ్గరే కొనమనీ, కావలిస్తే వాళ్లకన్నా ప్రతిదీ వొక కానీ తక్కువకే ఇస్తాననీ మరీ మరీ చెప్పిపోయింది."

"ఆమెవరకూ బాగానేవుంది. కాని ఆమెతో కలిసి కాపురంవుండటానికి రెండో ఆమె వొప్పుకున్నదటా?" అని అడిగాను.

ప్రస్తుతానికి మూతి ముణగదీసుకొని కూర్చొంటూ వుందట" అన్నది నా భార్య. "ఆ సంగతి ఆమెను అడిగితే గాని యదార్థ తేలదు" అన్నది.

నాకు తెలియకుండా నేను వాళ్ళకోసం ప్రతి సాయంకాలం కనిపెట్టుకుని కూర్చునేవాణ్ణి. కాని వారంరోజులపాటు యెవ్వరూ కనపడలేదు.

వారం దాటింతరువా, వొకరోజు అతను ఒక్కడే బండితోసుకుంటూ వచ్చి మా గుమ్మంముందు ఆపాడు.

"ఎక్కడా కనబడటంలేదేమోయ్!" అని అడిగాను నేను కూరగాయలుకొంటూ.

"వూరెళ్ళానండీ" అన్నాడు.

"వ్యాపారం విడిచిపెట్టి వెళ్ళవలసినంత పనేంకలిగిందీ" అని అడిగాను, సంగతులు తెలుసుకుందామనే ఉద్దేశంతో.

"పెద్దపనే కలిగిందండీ. మా అమ్మ ఏదో ఒకటితెచ్చి కొంపమీద పెడుతుంది. అది చేసేపనులు సర్దుకొచ్చుకునే తలికి నాకు చచ్చి బతికినంత పని అవుతావుంది."

"ఏం చేసిందేమిటి?"

"నా మొదటి పెళ్ళాన్ని ఎరుగుదురుగా మొదట్లో నాతో కలిసి కూరగాయలు అమ్ముతూవుండేది. అది ఖమ్మం పోయింది పోక, తిరిగొచ్చి మళ్ళీ మా యింట్లో మకాం పెట్టిందండీ. ఎంతచెడ్డా నా మేనత్తకూతురుగదండీ. ఎట్లా వొద్దు పొమ్మనేట్టు? ముందు మా అమ్మ దగ్గరకుజేరి కల్ల

బొల్లి మాటలు చెప్పి ఆబిడని లోబరచుకుంది. ఆబిడ చెవు దగ్గర వొక్కటే పోరుపెట్టింది, దాన్నికూడా దగ్గిరికి తియ్యమని. నాకూ్కడా దాని సంగతిచూస్తే జాలేసింది. ఎంత ఒద్దనుకున్నా అలవాటుపడ్డ ప్రాణంగదండీ. ఏదో వీలు దొరికినప్పుడల్లా ఒక మంచిమాట అడుగుతూవచ్చా. అది చూచి రెండోది లేదండీ, అది చెప్పకుండా వుడాయించింది."

"ఎక్కడికి వెళ్ళింది?"

"ఇంకెక్కడికి ఎల్తుందండీ ? ఎకాయెకి కన్నారింటికెళ్ళి కూర్చుంది. అక్కడికీ రెండుమూడురోజులు చూశా, దానంతటదే తిరిగొస్తుందేమో అని. ఆది అసలే మంకుపట్టుది. అదెందుకొస్తుంది? ఆ పట్నా నేనే బయలుదేరి దానికాడికి ఎళ్ళా. మొదట్లో రాను పొమ్మంటే రాను పొమ్మంది. నేను నాలుగురోజులు అక్కడేవుండి, ఇక నా మొదటి పెళ్ళాంతో మాట్లాడననీ, దానిఖ్ఖాసే ఎత్తననీ మాటిచ్చితోలుకువచ్చా" అన్నాడు.

"మరి నీ మొదటిభార్య ఏమంటున్నది?" అని అడిగాను.

"అది యీడ వుంటుందండీ? నేను నా రెండోదాని కోసం వెళ్ళినరోజే ఆ ఖమ్మంవాడు వచ్చాడంట. వాడితో కలిసి 'జై పరమేశ్వరా' అంది"

"మరి మీ అమ్మ ఏమంటున్నది?",

"అది ఇంకా నన్నే తిడతావుందండి, నువ్వు సరిగ్గా చూడకపోబట్టి పోయిందిగాని చూస్తే యెందుకు పోయేదని? ఇంతకీ ఇయ్యి మంచికి రోజులు కాదండీ" అన్నాడు.

నేను చిక్కుడుగాయలూ, వొకపావుశేరు కాకరగాయలూ, వొక అణా పచ్చిమిరపకాయలూ, కొతిమేరా కరివేపాకూ కొనుక్కొని ఇంట్లోకి వెళ్ళాను.

ఇంట్లో నా భార్యతో జరిగిన సంగతంతా చెప్పాను.

"ఈ గొడవకి అంతూపొంతూ వుండేటట్టు లేదుగాని ఇకమీద పట్టించుకోకండి" అన్నదామె.

"వాళ్ళ సంగతి ఏదన్నా తెలుస్తూవుంటే, చెపుతూ వుండు" అన్నాను నేను.

నా భార్యకు అకస్మాత్తుగా ఏదో అనుమానం కలిగి నట్టుగావుంది. "తరచి తరచి తెలుసుకుంటున్నారు, వాళ్ళ మీద ఏమన్నా కథరాస్తారా ఏమిటి కొంపతీసి?" అనడిగింది.

"రాస్తే రాస్తాను" అన్నాను.

"మీ ఆశేగాని వాళ్ళకథ ముగియదండీ" అన్నది.

"పోనీ ఈసారి ముగియని కథేరాస్తాను. అన్నికథలూ ముగియాలని ఎక్కడుందీ?" అన్నాను నవ్వుతూ.

ఇది జరిగిన రెండు మూడువారాల వరకూ అతనూ, అతని రెండవభార్యా కూరగాయలు అమ్ముకుంటూ, బండి తోసుకుంటూ వచ్చారు. తరువాత, ఏమయ్యారో ఏమో పత్తాలేరు. నెలదాటింది. రెండునెలలుదాటినై. మూడునెలలు దాటినై. వాళ్ళు మా బజారుకురాలేదు. వూళ్ళోకూడా నాకు

ఎక్కడా కనుపించలేదు. మేము వాళ్ళసంగతే మర్చిపోయాం. మాకు కావలసిన కూరగాయలు మరొక బండివానిదగ్గర కొనుక్కుంటున్నాం. చివరికి నాభార్య చెప్పినట్లు వాళ్ళదిముగింపు లేనికథే అయిందని నిశ్చయించుకొని నిరాశచెందాను.

అది వేసవికాలం. యెండలు విపరీతంగా వేస్తున్నయి. అందులో హైదరాబాద్ ఎండ మనిషిని వున్నవాణ్ని వున్నట్లు పీల్చి పిప్పిచేసేఎండ. సర్కారుజిల్లాలో ఎండలాంటిదికాదు. సర్కారుజిల్లాలో ఎండకు వూరికినే మంచినీళ్ళు త్రాగబుద్ధి అవుతుంది. చెమట వర్షంగా శరీరాన్నుంచి దిగజారిపోతూ వుంటుంది. ఇక్కడ మంచినీరైతే తాగబుద్ధి అవుతుందేమో గాని, చెమట మాత్రం పట్టదు. త్రాగిన మంచినీళ్ళన్నీ లోలోనే హరించిపోతై. మనం మూగఎండ అనుకుంటామే, అటువంటిది హైదరాబాద్ ఎండ.

ఆ ఎండకు భయపడి చల్లబడేదాకా ఆఫీసులోనే కూర్చొని నెమ్మదిగా యింటికి బయలుదేరాను. అది మామిడి పండ్ల కాలం. చక్కనిరసాలు ఒకతోపుడు బండిమీద రాసిగా పోసి ఉన్నయి. ఆ బండి రోడ్డు ప్రక్కన నిలబెట్టి వుంది. ఆ బండిప్రక్కన ఒక ముసలమ్మ కూర్చొనివుంది.

బండినిండా రాసిపోసివున్న ఆ మామిడి కాయలను చూచేటప్పటికి నాకు ప్రాణంలేచివచ్చింది. కొని యింటికితీసుకు పోదామని ఆ బండిదగ్గరకు వెళ్ళాను.

నన్నుచూచి పక్కయింటి అరుగుమీద నీడకుగాను కూర్చొనివున్న వొక కుంటిఅతను, చంకల్లోవున్న కర్రలు

పోటు వేసుకుంటూ గబగబా నడిచివచ్చాడు. "కాయలు కావాలాఅండీ?" అని అడిగాడు.

గొంతు ఎక్కడో విన్నట్లనిపించింది. పరీక్షగా చూద్దునుగదా, మా యింటికి యిదివరకు అమ్మకోటానికి వచ్చే కూరగాయల అతను.

అతనినిచూచి నా కండ్లను నేనే నమ్మలేకపోయాను. మనస్సు కలుక్కుమన్నది. అతను ఎప్పుడూ ఉన్నంతలో శుభ్రంగా ఉండేవాడు. ఇప్పుడు బుగ్గలు చొట్టపడి, గడ్డంపెరిగి, కండ్లు పీక్కుపోయి, జుట్టు దుబ్బుకట్టి ఉన్నాడు. గుడ్డలు చిరిగిపోయి మురికితో అట్టలుకట్టి ఉన్నాయి.

"ఇదేమిటి ఇలావున్నావు?" అని అడిగాను గాద్గదికమైన స్వరంతో.

"కారు దెబ్బకొట్టిందండీ. మూడునెల్లకుపైనే అయ్యి ఉంటుంది. ఆరోజు నేను మామూలుగా బండి తోసుకు వస్తున్నా. నేను కరెక్టుగా ఎడమచేతివైపుగానే వస్తున్నా. కార్లువున్నోళ్ళకి కళ్ళు కనపడతయ్యాటండీ. గాడితప్పి వొచ్చి గుద్దాడు. నేను ముందుగాచూచి కేకలువేసుకుంటూ అడ్డం పడకపోతే అది చచ్చేదే. దెబ్బ దానికి తప్పింది; నాకు కొట్టింది. వెంటనే ఆస్పత్రిలో పడేశారుండీ. బయటకు వొచ్చేటప్పటికి మూడునెల్లుపట్టింది. నేను యెనకేసుకున్న అయిదువందలుకాక అయిదువందలు అప్పుచేశా. అప్పటికీ అవతారంతో బయటపడ్డా. అంత ఖర్చుపెట్టినా కేసుమాత్రం రాలేదు." అన్నాడు.

"ఆ కారు యజమానిమీద కేసుపెట్టలేదా?"

"పోలీసోళ్లు పెడదాం అనే అన్నారండీ. అప్పుడు అతను నా గాయాలు మానేందుకు అయ్యే ఖర్చంతా కూడా అతనే పెట్టుకుంటానన్నారు. ఆ కేసేమయిందో యీ డబ్బేమయిందో మళ్ళీ నా మొహం చూసినవాళ్ళే లేరు. పెద్దోళ్లు గదండీ, ఎన్ని నేరాలు చేసైనా ఆళ్ళు తప్పించుకోగలరు" అన్నాడు.

"సంచులుబోసి నోళ్ళు కడతారండీ. మాబోటి బీదోళ్ళ మాట ఇనే దెవ్వరు?" అన్నది ప్రక్కనున్న ముసలిది.

"ఆమె ఎవ్వరు?" అన్నట్టు నేను అతనివంక చూశాను.

నా అర్థం గ్రహించి "మా అమ్మండీ" అన్నాడు.

ఆమె ముసలివగ్గు శరీరంమీద తోళ్ళు వ్రేలాడుతున్నాయి. కండ్లుకూడా కనపడ వనుకుంటాను. నుంచోవటం కూడా కష్టంమీద, పెద్దప్రయత్నంమీదగాని చెయ్యలేదు. అంతకుముందు విన్న మాటలను బట్టి అతని తల్లిమీద నాకు ఏ మూలో దురభిప్రాయం ఉండేది. ఆమెను చూసేటప్పటికి ఆ దురభిప్రాయం మాయం అవటమేకాక హృదయం కరిగి నీరయింది.

"ఇంత యెండలో ఆ ముసలమ్మను యెందుకు తీసుకు వచ్చావ్?" అని అడిగాను.

"నేను దెబ్బతగిలి ఆస్పత్రిలో జేరేతలికి మీరు చూశారుచూడండి ఆ రెండోది — దానిదారిన అది ఎళ్ళిపోయింది. కాయలు అమ్ముకుంటేగాని మాకు పొట్టగడవదు. నేను చంకలక్రింద ఈ కర్రలు పెట్టుకొని బండి తొయ్యలేను.

కాయలు తుయ్యలేను. అందుకని మా అమ్మని అడ్డంపెట్టు కొని యాపారం మొదలుపెట్టా" అన్నాడు.

"నీ మేన త్తకూతురు ఏమయిందోయ్?" అని అడిగాను, సమయానికి ఆమె అయినావచ్చి ఆదుకొని వుండవచ్చనే ఆశతో.

"కుంటోణ్ణి ఎవ్వరుమాత్రం యెందుకు అంటిపెట్టు కుంటారండీ," అన్నాడతను. అదొకమామూలు వ్యవ హారంగా, మారనిసత్యంగా చెప్పాడు. ఏ మాత్రం విచారం గానీ, కోపంగానీ అతనిమాటల్లో ధ్వనించలేదు

"మంచిమాట అన్నావురా," అన్నది ముసిల్ది.

"కుంటోడివైనా గుడ్డోడివైనా కన్నతల్లిని గనక నాకు తప్పదు."

"చూడు, నెలరోజులు తిరిగొచ్చేటప్పటికి ఈ చంకల క్రిందకర్రలు అవతలపారేసి, మళ్ళీ యాపారం సాగించి డబ్బు గడించకపోతే!" అన్నాడు కోపంగా.

అతని ఆత్మవిశ్వాసానికి నా శరీరం జలదరించింది. వాళ్ళకి ఉన్న సొత్తే అది.

అతను కోపందిగమ్రింగి "కాయలు తీసుకుపోతారా అండీ? మంచిరసాలు. విజయవాడనుంచి ఇవ్వాళే లారీలో దిగినై. అన్నప్పుడూ యిటువంటి సరుకురాదండీ," అన్నాడు.

"ఇవ్వు"

"నాలుగు శేర్లు తీసుకెళ్ళండి. పిల్లాళ్ళు తింటారు. ఇప్పుడు మీ దగ్గరడబ్బు లేకపోతే ఆనక్కు ఇంటికొచ్చి అమ్మ దగ్గర తీసుకుంటాలెండి," అన్నాడు.

నేను చెప్పటం మఱచిపోయాను. హైదరాబాద్‌లో నాకు విచిత్రంగా కనుపించే వాటిల్లో మామిడి కాయలను తక్కెడలో తూచి అమ్మటం ఒకటి. నిజంగా నాకీవిషయం చాలా విచిత్రంగా కనుపించేది.

అతను నాలుగు శేర్లు కాయలు తూచి ఇవ్వమని ముసలమ్మకు చెప్పాడు. ముసలమ్మ రెండు శేర్ల చొప్పున తుయ్యటానికి ప్రయత్నించింది. కాని తక్కెడపైకి లేపలేక పోయింది. చెయ్యి వణికింది. అదిచూస్తూ నిలబడిన అతనికి తన అసమర్థత జ్ఞాపకంవచ్చి రోషంవొచ్చింది. చంకలక్రింద వున్న కర్రలమీద శరీరాన్ని మోపి, తానే తుయ్యటానికి పూనుకున్నాడు. తూచాడు. కాని ఆ స్థితిలో తుయ్యడం అతనికి ఎంతబాధాకరమైన విషయమో నేను గ్రహించకపోలేదు.

తుయ్యగలిగినందుకు అతని కండ్లు మెరుపువలె మెరిసినట్లు మెరిసినై.

నేను మామడికాయలు పట్టుకొని ఋంటికి బయలుదేరాను. నా కథకు ముగింపు దొరికింది. కాని ఎంత విషాదకరమైన ముగింపు! ముగింపు ఇంత విషాదాంతంగా ఉందనుకుంటే దానికోసం నేను ఆరాటపడి ఉండకపోదును.

కాని అతడు దురదృష్టానికి లొంగేవ్యక్తి కాదనే విశ్వాసం నాకు వుంది. ఎప్పుడో వొకప్పుడు చిరునవ్వు

నవ్వుకుంటూ కూరగాయలబండిని తోసుకువచ్చి మాగుమ్మం దగ్గర ఆపకపోడనే ధైర్యంవుంది. అప్పుడు ప్రక్కన మొదటిదో, రెండోదో, వాళ్ళిద్దరూ ఒప్పుకోకపోతే మూడోదో ఉండక పోదు. ఈ విశ్వాసం ధైర్యాలే నా మనస్సులో చెలరేగిన బాధను కప్పి నాకు కాస్త శాంతిని చేకూర్చినై.

స మా ప్త ము